క్లుప్తంగా

నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఆదివారం నాయుడువాడ ముదిరాజ్ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు. పి.లక్ష్మణ్ తెలిపారు. నాయుడవాడ అధ్యక్షుడిగా ఏపూరి ఉషన్న గారి గంగాధర్, ఉపాధ్యక్షుడిగా ఎం.పోశెట్టి, సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా సుంకరి రమేశ్, ప్రచార కార్యదర్శిగా ఏపూరి రమేశ్, కోశాధికారిగా మస్కురి శ్రీనివాస్, సలహాసభ్యులుగా పి.నారాయణ, పి.మహిపాల్, ఎం.భీమేశ్వర్, ఎ.ప్రమోద్, యశ్వంత్, ఎస్.సురేశ్, ఎం.చంద్రశేఖర్, పి.రాజశేఖర్, ఎస్.సత్యం, ఎ.నవీన్‌కుమార్, అరవింద్, గోపిని ఎన్నుకునట్లు పేర్కొన్నారు.

భీమన్న ఉత్సవాలు ప్రారంభం



ఉత్సవాలకు హాజరైన భక్తులు

మామడ: మండలంలోని నల్దుర్తిలో భీమన్న స్వామి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉత్సవ విగ్రహాలను గోదావ రి నదికి తీసుకెళ్లి పుణ్య స్నానం అనంతరం సోమవారం ఉదయం ఆలయానికి తీసుకొ స్తారు. అనంతరం కల్యాణం నిర్వహిస్తారు. ఆలయ కమిటీ వారు ఏర్పాట్లు పూర్తి చేశారు.

అల్ఫోర్స్‌లో నమూనా ఎన్నికలు



విద్యార్థులతో చైర్మన్ నరేందర్‌రెడ్డి

భైంసాటౌన్: పట్టణంలోని అల్ఫోర్స్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నమూనా ఎన్నికలు నిర్వహించారు. పాఠశాలలో హౌస్ కెప్టెన్, వైస్ కెప్టెన్ల ఎంపిక కోసం ఎన్నిక నిర్వహించగా..విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. దీనికి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి హాజరై ఎన్నికల ప్రక్రియ పరిశీలించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి



హైమద్ (ఫైల్)

తానూరు: తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏగా విధులు నిర్వర్తించిన తానూరు కు చెందిన పీర్ హైమద్(50) అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబీకుల వివరాల ప్రకారం పీర్‌హైమద్ వారం రోజుల కిందట అనారోగ్యానికి గురవగా హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

హైమద్ మృతికి సంతాపంగా తానూరు పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. సర్పంచ్ విఠల్, రాములు, పండరి, శివాజీపటేల్, సోమ్‌నాథ్ తదితరులు ఉన్నారు.

'ఉన్నతులుగా తీర్చిదిద్దాలి'



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రాజేశ్వర్

భైంసాటౌన్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని శ్రీ సరస్వతి విద్యాపీఠం జిల్లా కార్యదర్శి సోలాపూర్ రాజేశ్వర్ అన్నారు. భైంసాలోని కిసాన్‌గల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో రెండు రోజులుగా ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో ఉపాధ్యాయులు నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు బోధించాలన్నారు. పాఠ్యాంశాలతోపాటు నైతిక విలువలతో కూడిన విద్య అందించాలని కోరారు. కార్యక్రమంలో కట్టా నాగచారి, డా దామోదర్, డా నాగేశ్, కిషన్, గోపాల్, తదితరులున్నారు.

గజ్జలమ్మ దేవికి పూజలు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, ధర్మాబాద్, బోకర్, అప్పారావుపేట్, ఇస్లాపూర్, శివుని ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గజ్జలమ్మకు అభిషేకం, అలంకరణ, పల్లకిసేవలో భక్తులు పాల్గొన్నారు. వెంకూర్ పెద్దమ్మ ఆలయంలో కూడా భక్తులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తీపి కబురు

- డైట్ చార్జీలను 25 శాతం పెంచుతూ నిర్ణయం
- ఈనెల నుంచే వర్తింపు
- జిల్లాలో 20 వేల మంది లబ్ధి
- మరింత పోషకాహారం అందనున్న వైనం



లక్ష్మణచాంద కేజీబీవీ భవనం



కేజీబీవీలో భోజనం చేస్తున్న బాలికలు

లక్ష్మణచాంద: రాష్ట్రంలోని వసతిగృహాల్లో ఉండే విద్యార్థుల మెస్(డైట్) చార్జీలను పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇబ్బందులు ఎదురైనా.. ప్రత్యేక రాష్ట్రంలో ప్రభుత్వం వసతిగృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందిస్తుంది. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఇటీవల మెస్ చార్జీలు 25 శాతం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పెంచిన చార్జీలను తక్షణమే వర్తించేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల పరిధిలో వసతిగృహాలు, గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీల్లో చదివే విద్యార్థులకు మరింత పౌష్టికాహారం అందనుంది. మెస్ చార్జీలు పెంచడంతో 20 వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.

జిల్లాలో 20 వేల మంది విద్యార్థులు..

జిల్లాలో 18 కేజీబీవీలు, ఒక ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ, 5 సోషల్ వెల్ఫేర్ సొసైటీలు, 13 ఆశ్రమ పాఠశాలలు, ఒక మోడల్ పాఠశాల, 6 ఎంజేపీ పాఠశాలలు, 5 మైనార్టీ వెల్ఫేర్ సొసైటీలో చదివే 20 వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.

పెంచిన మెస్ చార్జీలు ఇలా ....

ప్రస్తుతం వసతిగృహాలు, గురుకులాల్లో 3 నుంచి 7 తరగతుల విద్యార్థులకు నెలకు రూ.950.. అలాగే 8 నుంచి 10 తరగతుల వారికి నెలకు రూ.1100, ఇంటర్ నుంచి పీజీ వరకు నెలకు రూ.1500 వరకు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం వీటిని 25 శాతం పెంచడంతో 3 నుంచి 7 తరగతుల వారికి నెలకు రూ.1200.. అలాగే 8 నుంచి 10 తరగతుల వారికి రూ.1400, ఇంటర్ నుంచి పీజీ విద్యార్థులకు రూ.1875 పెరగనున్నాయి. అలాగే కేజీబీవీల్లో 6 నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు గతంలో నెలకు రూ.1060 చెల్లిస్తుండగా.. పెరిగిన చార్జీలతో ప్రస్తుతం రూ.1225 కు పెరిగిందని ఎస్‌వోలు పేర్కొంటున్నారు.

విద్యార్థులకు తీరనున్న కష్టాలు..

రాష్ట్ర ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచడంతో విద్యార్థులకు ఇక నుంచి పోషకాహారం అందుతుందని అటు విద్యార్థులు.. ఇటు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు మన ఊరు- మనబడి కార్యక్రమం చేపట్టగా..మరో పక్క విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచడంతో నాణ్యమైన విద్యతోపాటు భోజనం అందనుంది.

ఇబ్బందులు దూరమవుతాయి..



వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులకు మెస్ చా ర్జీలు పెంచినందుకు సీఎం సార్‌కు ధన్యవాదాలు. దీంతో మా సమస్యలు తీరుతాయి. పాఠశాలలో వసతులు కల్పించడంతోపాటు మెస్ చార్జీలు పెంచడం ఆనందంగా ఉంది.

– అనూష, కేజీబీవీ విద్యార్థిని, లక్ష్మణచాంద

పెంచడం సంతోషకరం..



పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలు పెంచడం సంతోషకరం. ఈ చార్జీల పెంపుతో తమకు మరింత నాణ్యమైన భోజనం అందుతుంది. దీంతో పూర్తి స్థాయిలో చదువుపై దృష్టి సారిస్తాం.

– రాధిక, కేజీబీవీ విద్యార్థిని, లక్ష్మణచాంద

విద్యార్థులకు మేలు



నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ఈ తరుణంలో డైట్ చార్జీలు పెంచడంతో వసతిగృహాల్లోని విద్యార్థులకు మేలు జరుగుతుంది. దీంతో మరింత మంచి భోజనం విద్యార్థులకు అందుతుంది.

– నవిత, ఎస్‌వో, లక్ష్మణచాంద

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



భైంసారూరల్: దేగాంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

భైంసారూరల్: బీడీ కంపెనీల్లోని ప్యాకర్లు, చాటన్‌వాలా, మునిమ్, బట్టివాలా, క్లర్క్‌లకు పెన్షన్ అందించాలని ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. మండలంలోని దేగాం గ్రామంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈసందర్భంగా ఆ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరిత మాట్లాడారు. ఆంక్షల్లేకుండా జీవన భృతిని 58 ఏళ్ల వచ్చే వరకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్మికులు రాములు, భోజన్న, లక్ష్మన్, రాజేశ్వర్, సురేశ్, నర్సయ్య, గంగాధర్, తులసీరాం, సాయిలు, నరేందర్ తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ముధోల్: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. విజయలక్ష్మికి రూ.22వేలు, మహ్మద్ అత్తర్‌కు రూ. 20వేలు, హరిప బేగంలకు రూ.10వేల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీ సరళ, శ్రీనివాస్‌గౌడ్, రైతుబంధు మండలాధ్యక్షుడు రాంరెడ్డి, ఎంపీటీసీ గంగాధర్, ఆరిఫ్, రాజేశ్వర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని..

కుంటాల: పంచాయతీ కార్యాలయంలో పని చేసే కారోబార్లకు సీనియార్టీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు కూస శంకర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ముధోల్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి విన్నవించారు. సహాయ పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్ల నియామానికి కృషి చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ అంశం సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామన్నట్లు పేర్కొన్నారు. బాసర, భైంసా, నిర్మల్, ఖానాపూర్, సారంగాపూర్, కుంటాల, నర్సాపూర్(జి), దిలావర్‌పూర్ మండలాల అధ్యక్షులు సాయిరెడ్డి, కిషన్, రావు, గంగాకిషన్, ప్రసన్న, నారాయణ, భాస్కర్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

'హర్ ఘర్ తిరంగా' జయప్రదం చేయండి



ఖానాపూర్‌లో జెండాలు ప్రదర్శిస్తున్న నేతలు



నిర్మల్‌లో జెండాలను చూపుతున్న నాయకులు

ఖానాపూర్: ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీజేపీ నాయకురాలు, పెంబి జెడ్పీటీసీ జానుబాయి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఆవరణలో అసెంబ్లీ కన్వీనర్ పడాల రాజశేఖర్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలు ప్రదర్శించారు. అనంతరం వీధుల్లో ర్యాలీ నిర్వహించి పలువురు వ్యాపారులకు జెండాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుధాకర్, డి.మల్లయ్య, బుచ్చన్న, ఆనంద్, భూమన్న, గోపాల్ రెడ్డి, గిరి, స్వామి ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

సన్మానం..

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో మేరీ మిట్టి–మేరీ దేశ్, ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ఆదివారం సైనికుడు నితిన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బీజేవైఎం ఐటీ, సోషల్ మీడియా మండల కన్వీనర్ సాయి సూర్య వంశీ, భూషణ్, శ్రీధర్, సంపత్, గంగారెడ్డి, గజ్జారాం తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని నిర్మల్ అసెంబ్లీ కన్వీనర్ నాయుడి మురళీధర్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం మండలాల వారీగా జాతీయజెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బర్కుంట నరేందర్, దిలావర్‌పూర్ మండలాధ్యక్షుడు శైలేశ్వర్, రచ్చ మల్లేశ్, అయ్యన్నగారి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్లకు తరలిన పద్మశాలీలు



ఖానాపూర్ నుంచి బయలుదేరుతున్న పద్మశాలీలు



లక్ష్మణచాంద నుంచి వెళ్తున్న నాయకులు



కుంటాల: కల్లూరు నుంచి వెళ్తున్న నేతలు

ఖానాపూర్: పద్మశాలీలపై పాలకులు వివక్ష చూపకుండా అన్ని రంగాల్లో ప్రాధాన్యం కల్పించాలని పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు, ప్రవాసీ భారతీయుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రుద్ర శంకర్ అన్నారు. ఆదివారం కోరుట్లలో పద్మశాలీలు నిర్వహించిన కార్యక్రమానికి ఖానాపూర్, తిమ్మాపూర్ పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో నాయకులు వేర్వేరుగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో ఆయన మాట్లాడారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సక్కారం శ్రీనివాస్, పద్మశాలి సంఘం పట్టణాధ్యక్షుడు అల్వాల శ్రీనివాస్, నర్సయ్య, రవి, కిషన్, రాజన్న, రవి, నాగరాజు, భీంరాజు తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: మండలంలోని ఆయా గ్రామాల పద్మశాలీలు కోరుట్ల సభకు వాహనాల్లో తరలివెళ్లారు.

కుంటాల: నియోజకవర్గంలో పద్మశాలి సంఘం సభ్యులు మండలంలోని కల్లూర్ మార్కండేయ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి కోరుట్లకు వెళ్లారు. కార్యక్రమంలో సభ్యులు కృష్ణదాస్, కాశీరాం, భూమన్న గంగుల చిన్నన్న, గంగాధర్, శ్రావణ్, నర్సయ్య, గజేందర్, గంగయ్య, పోశెట్టి, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

తానూరు: కోరుట్లకు మండలంలోని గ్రామాల పద్మశాలి సంఘం నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు. ఆ సంఘం నాయకులు భూమన్న, సాయినాథ్, గంగాధర్, పోశెట్టి, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి గంగుల చిన్నన్న తదితరులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణం నుంచి పద్మశాలీలు స్థానిక సంఘ భవనం నుంచి కోరుట్లకు వాహనాల్లో వెళ్లారు.

లక్ష్మణచాంద: వివిధ గ్రామాల పద్మశాలీలు కోరుట్లలో నిర్వహించిన సభకు తరలివెళ్లారు. ఆ సంఘం మండలాధ్యక్షుడు నారాయణ, మల్లాపూర్ సర్పంచ్ రవి, శంకర్, సుదర్శన్, మహేందర్ ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. అధ్వానంగా రోడ్డు



తానూరు: మండలంలోని ఝురి(భి) నుంచి ఝురి(బి)తండాకు వెళ్లే బీటీ రోడ్డు తారు లేచి.. కంకరతేలి ప్రమాదకరంగా మారింది. రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో మూడేళ్లకే దెబ్బతిందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: జగదీశ్, పీఆర్ ఏఈ, ఫోన్: 91211 35623

బీఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధి



కండువా కప్పుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. పట్టణంలో తన నివాసంతోపాటు మండలంలోని గోసంపల్లెలో ఆదివారం జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా.. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పుప్పాల శంకర్, మోహిద్, పరిమి సురేశ్, టీకు గంగారాం, రాము నాయక్, తూము చరణ్, గొర్రె గంగాధర్, ఆమంద శ్రీనివాస్, రాజేశ్వర్, శోభన్, సంతోష్, కేహెచ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నేతల కోసమే 'గృహలక్ష్మి'

ఖానాపూర్: బీఆర్‌ఎస్ నేతలకు లబ్ధి చేకూర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టిందని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు తిలక్‌రావు ఆరోపించారు. ఆదివారం ఖానాపూర్‌లో మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న పేద ప్రజలు మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నా.. వారికి లబ్ధి చేయడం లేదన్నారు. తమకు ఓట్లు వేసిన వారికే గృహలక్ష్మి, దళితబంధు పెన్షన్లు వస్తాయని ఆ పార్టీ నేతలు ప్రజలకు చెబుతున్నారని అన్నారు. వైన్స్ టెండర్ల దరఖాస్తుకు 20రోజుల గడువు ఇచ్చిన ప్రభుత్వం గృహలక్ష్మికి మాత్రం మూడు రోజులే గడువు ఇచ్చిందన్నారు. ఖానాపూర్ డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పంపిణీలో జరిగిన అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

'స్వార్థం కోసమే మాస్టర్‌ప్లాన్'



సమావేశంలో మాట్లాడుతున్న రాంనాథ్

నిర్మల్‌చైన్‌గేట్: బీఆర్‌ఎస్ నేతలు ప్రజల ఫిర్యాదులను, ప్రజా ప్రయోజనాలను పక్కన పెట్టి స్వార్థంతో నిర్మల్ పట్టణం మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించడం సరికాదని బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, అయ్యన్నగారి భూమయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మహేశ్వరరెడ్డి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నిర్మల్ ప్రజలకు అండగా బీజేపీ ఉంటుందన్నారు. నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ తక్షణమే బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనను విమర్శించే స్థాయి బీఆర్‌ఎస్ నేతలకు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మల్ అధికార పార్టీ నేతల అవినీతి చిట్టా త్వరలో ప్రజల ముందు ప్రవేశపెడతామన్నారు. రాబోయే ఎన్నికల ఖర్చుల కోసం ఇప్పటినుంచే రూ.వేల కోట్లు రాబట్టడానికి ఈమాస్టర్ ప్లాన్ రూపొందించి కోట్లు గడించాలని చూస్తున్నారని అన్నారు. మహేశ్వర్‌రెడ్డి నివాస స్థలం అక్రమంగా ఉందన్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్‌కు మంత్రి కుమారుడు ముంచిన ధర్మసాగర్ చెరువు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు మెడిసెమ్మ రాజు, రాజేశ్వర్‌రెడ్డి, అరవింద్, ముత్యంరెడ్డి, మురళి, భూపతిరెడ్డి, శ్రీరామోజు నరేశ్, చందు, విఠల్, చాణక్య పాల్గొన్నారు.

'వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలి'



కాంగ్రెస్‌లో చేరినవారితో శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: బూటకపు మాటలు, అబద్ధపు హామీలతో మైనార్టీ ప్రజలను మోసం చేసిన సీఎం కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని గుల్జార్ మార్కెట్‌కు చెందిన 200 మంది మైనార్టీ యువకులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మల్ పట్టణంలో హజ్ హౌస్, షాదిఖానా, కమ్యూనిటీ భవనం నిర్మిస్తానని చెప్పిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ముస్లింలను మోసం చేశారని మండిపడ్డారు. మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తానని ఇచ్చిన హామీని సీఎం విస్మరించారన్నారు.

పట్టణంలో ర్యాలీ..

కాంగ్రెస్‌లో చేరిన యువకులు గుల్జార్ మార్కెట్ నుంచి శ్రీహరిరావు నివాసం వరకు ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. అర్జుమాన్ అలీ, జునైత్ మెమన్, మతిన్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రశ్నిస్తే.. అక్రమ కేసులు సరికాదు'



మాట్లాడుతున్న సతీశ్‌రెడ్డి

కడెం: ప్రజల పక్షాన ప్రశ్నించిన నాయకులపై ఎమ్మెల్యే రేఖానాయక్ అక్రమ కేసులు పెట్టించడం సరికాదని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు సతీశ్ రెడ్డి అన్నారు. ఆదివారం కడెంలోని హరిత రిసార్ట్స్‌లో ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు తరి శంకర్‌తో కలిసి మాట్లాడారు. ఇంద్రవెల్లి మండలం డొంగర్‌గావ్‌లో హనుమాన్ విగ్రహం వెండి కళ్లను ఎమ్మెల్యే తీసుకెళ్లారనిగ్రామస్తులు పేర్కొన్న విషయం తెలిసిందే. గ్రామస్తులకు మద్దతుగా నిలిచిన ఏఐసీసీ రిసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్‌పై ఎమ్మెల్యే ఇంద్రవెల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టించారని ఆరోపించారు. రహీం, మహిపాల్‌రెడ్డి, గంగాధర్, అంజన్న, నర్సయ్య, తదితరులు ఉన్నారు.

బాధితులకు పరామర్శ

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్ గ్రామ సర్పంచ్ గుగ్లావత్ లక్ష్మణ్ తండ్రి మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను బీఆర్‌ఎస్ నాయకులు భుక్యా జాన్సన్‌నాయక్ ఆదివారం పరామర్శించారు. శ్రావణ్, వీరేశ్, గుండ చిన్నయ్య, ఎర్రన్న, సాయినరేశ్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ పట్టివేత

ఖానాపూర్: పట్టణ శివారు కుమురం భీం చౌరస్తా ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు. ఆదివారం అటవీ, ఎస్‌బీ అధికారుల సమాచారం మేరకు టిప్పర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.